ప్రజాశక్తి

గురువారం 15 మే 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

దేశంలో అబద్ధాల సంస్కృతి

రాజ్యమేలుతోంది..

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ఆకట్టుకున్న 'ప్రజాపాటల సందడి' కార్యక్రమం

8లో



కళారూపాలు ప్రదర్శిస్తున్న కర్నూలు జిల్లా ప్రజానాట్యమండలి కళాకారులు



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

ఆధిపత్య గొడవతోనే..

- వీరయ్యచౌదరి హత్యకు అదే కారణం
- సాంబయ్య, వినోద్‌లే హత్యలో ప్రధాన కుట్రదారులు
- కత్తులతో పొడిచి చంపిన కిరాయి హంతకులు
- లోకేష్ పర్యటన నేపథ్యంలో నిందితుల అరెస్టు
- ఘటన వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నాగులుప్పలపాడు మాజీ ఎంపిపీ ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య కేసు మిస్టరీ వీడింది. ఈ కేసులో ప్రధాన కుట్రదారులను, హత్య చేసిన నిందితులను బుధవారం సాయంత్రం ఎస్పీ దామోదర్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ హత్య కేసులో మొత్తం 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. మంత్రి నారా లోకేష్ గురువారం ఉదయం అమ్మనబ్రోలు వస్తున్న నేపథ్యంలో ఎస్పీ దామోదర్ నిందితుల అరెస్టు, కేసు వివరాలు వెల్లడించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎస్పీ దామోదర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ హత్యకు ప్రధాన కారణం గ్రామంలో ఆధిపత్య పోరే నని తేలింది. ఇసుక, రేషన్ వ్యాపారాల్లో గొడవలతో పాటు రాజకీయంగానూ ఎదుగుదల వంటి అంశాలూ ఈ హత్యలో ప్రధానంగా ఉన్నాయి. అమ్మనబ్రోలుకు చెందిన ఆళ్ల సాంబయ్య, ▶ 2లో




హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

టిడిపి ఖాతాలోకి చీరాల మున్సిపాలిటీ

- చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసంకు కౌన్సిలర్ల ఓటు
- హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే
- గంట ముందుగానే చైర్మన్ పదవికి జంజనం రాజీనామా
- వీడిన చీరాల చైర్మన్ పీఠం ఉత్కంఠ



చైర్మన్‌పై అవిశ్వాసానికి చేతులెత్తిన ఎంపీ, ఎమ్మెల్యే, కౌన్సిలర్లు



చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్న జంజనం

ప్రజాశక్తి-చీరాల

తెలుగుదేశం పార్టీ ఖాతాలోకి చీరాల మున్సిపాలిటీ చేరింది. గత కొద్దిరోజుల నుండి చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై జరుగుతున్న అవిశ్వాసం ఉత్కంఠకు బుధవారం తెరపడింది. చీరాలలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు సమక్షంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగింది. కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. చీరాల మున్సిపాలిటీ పరిధిలో 33 కౌన్సిలర్లు ఉండగా చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి 26 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా మద్దతు తెలిపారు. చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి 26 మంది కౌన్సిలర్లు, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి కౌన్సిలర్లు 27 మంది మద్దతు తెలిపారు. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే సమయంలో 1వ వార్డు కౌన్సిలర్ మొగిలి దీపిక సమావేశానికి రాలేకపోయారు. వైస్ చైర్మన్ జైసన్ బాబుపై అవిశ్వాస తీర్మానం పెట్టే సమయంలో దీపిక సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసానికి గంట ముందే మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. కాగా ఇప్పటి వరకు రెండో వైస్ చైర్మన్‌గా ఉన్న 20వ వార్డు కౌన్సిలర్ శిఖాకొల్లి రామసుబ్బులు తన పదవికి రాజీనామా చేశారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన అవిశ్వాస తీర్మానం మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగింది.

వైసీపీ ఆఫీస్‌గా మున్సిపల్ కార్యాలయం

ఎమ్మెల్యే మాలకొండయ్య

'మున్సిపల్ చైర్మన్ ముందుగా రాజీనామా చేస్తే అవిశ్వాస తీర్మానం ఉండేది కాదు. చీరాల మున్సిపల్ కార్యాలయాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా మార్చారు.. అందుకే మున్సిపల్ చైర్మన్ జంజనంపై అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చింది' అని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య తెలిపారు. అవిశ్వాస తీర్మానం పూర్తయిన అనంతరం ఎమ్మెల్యే కొండయ్య బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి క్రిష్ణప్రసాద్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాలుగా వైసీపీ పాలనాలో పట్టణంలో అభివృద్ధే జరగలేదన్నారు. చైర్మన్ తన నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటే బాగుండేదని చెప్పారు. చీరాల పట్టణాన్ని అభివద్ధి చేయడం కోసమే చైర్మన్‌ను దించడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని సియం చంద్రబాబు, మంత్రి లోకేష్ దష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. అనంతరం ఎంపీ తేనేటి కష్ణ ప్రసాద్ మాట్లాడుతూ చీరాల మున్సిపాలిటీలో అభివద్ధి జరగటం లేదని అభివద్ధి నిధులు పక్కదారి మళ్లాయని కౌన్సిలర్లు ▶ 2లో



మాట్లాడుతున్న రమాదేవి

బలమైన ప్రజాఉద్యమాల ద్వారానే

ప్రజాసమస్యల పరిష్కారం

- లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులు హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

మతోన్మాద, కార్పొరేట్ బిజెపి ప్రభుత్వం రైతాంగం, కార్మికులపై భారాలు వేస్తూ దోపిడీ శక్తుల ప్రయోజనాల కోసం పనిచేస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి విమర్శించారు. ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని తెలిపారు. బుధవారం బాపట్లలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో రమాదేవి మాట్లాడారు. మతోన్మాద, విద్వేష చర్యలను తిప్పికొడితేనే ప్రజల ఐక్యతను, కష్టజీవుల ఐక్యతను కాపాడుకోగలమన్నారు. బిజెపి ప్రభుత్వం నేడు లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులను హరించి పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పాటుపడుతోందన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ద్వారానే సాధ్యమవుతుందన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశంలో కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలతో ప్రజలపై భారాలు వేస్తోందన్నారు. ప్రజల మధ్య, కులాల మధ్య చిచ్చు రేపుతోందని విమర్శించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ సామాన్యప్రజలపై విద్యుత్ పన్నుల రూపంలో భారాలు మోపుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక ▶ 2లో

టిడిపి ఖాతాలోకి చీరాల మున్సిపాలిటీ

(మొదటిపేజీ తరువాయి)

ముక్తకంఠంతో చెప్పటంతో పాటు మహిళ కౌన్సిలర్లకు కూడా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు సరైన గౌరవం ఇవ్వలేదని ప్రజాప్రతినిధులు చాలా బాధపడుతున్నారని చెప్పారు. వారి అభీష్టం మేరకు అవిశ్వాసం పెట్టడం జరిగిందన్నారు. గత వైసీపీ పాలనలో పాలన గాడి తప్పిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై ప్రత్యేక దష్టి పెట్టి రాష్ట్రంలో దూసుకెళుతోందన్నారు.

నిబంధనల మేరకే అవిశ్వాసం: ఆర్డీవో

చీరాల మున్సిపల్ కౌన్సిలర్లు ఫిర్యాదు మేరకు ప్రభుత్వం నిబంధనలు అనుసరించి చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై అవిశ్వాస తీర్మానం పెట్టడం జరిగిందని ఎన్నికల అధికారి, ఆర్డీవో టి.చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్‌ను దించాలని కోరుతూ 27 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపి చేతులెత్తినట్లు చెప్పారు. సమావేశంలో జరిగిన ప్రతి విషయాన్నీ వీడియో రికార్డు చేయడం జరిగిందని, నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

త్వరలో నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక

చీరాల మున్సిపల్ పాలకవర్గంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబుపై కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టి నెగ్గిన నేపథ్యంలో వారి స్థానాలలో నూతన మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ప్రక్రియ ఈపాటికే ప్రారంభమైంది. ఎన్నిక తేదీ నిర్ణయం ప్రిన్సిపల్ సెక్రటరీ నుండి రావాల్సి ఉన్నట్లు సమాచారం. సుమారు పది రోజుల్లో జరగనున్న కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు అందరూ నూతన చైర్మన్‌ను మరియు వైస్ చైర్మన్‌లను వారి మద్దతు తెలియజేసి ఎన్నుకోనున్నారు. ఏదేమైనా జరగబోయే కౌన్సిల్ సమావేశంలో వీరి ఎన్నిక జరిగితే.. ఆ ఉత్కంఠ కూడా వీడనుంది.

ప్రజాసమస్యల పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

విధానాలపై ప్రజల భాగస్వామ్యంతో దేశవ్యాప్త పోరాటాలను నిర్వహిస్తామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో నల్లబర్లీ పొగాకు రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి.. రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో ఇద్దరు రాష్ట్ర మంత్రులు ఉన్నా పండించిన పొగాకు పంటను కొనుగోలు చేయించకపోవటం పట్ల రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో ప్రతి కౌలురైతుకీ గుర్తింపు కార్డు ఇవ్వాల న్నారు. సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.కష్ణమోహన్ అధ్యక్షత వహించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.మజుందార్, ఎన్.బాబూరావు, సిహెచ్.మణిలాల్, ఎం. కొండయ్య, వి.వెంకట్రామయ్య, బి.తిరుమల, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీతి కథలపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా పెద్దదోర్నాలలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలపై బుధవారం అవగాహన కల్పించారు. గణితంలో మెలుకువలు నేర్పారు. పలు క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంథపాలకుడు డి వెంకటసుబ్బారెడ్డి, ఫ్యాకల్టీ శేషిరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు శుభపరిణామం

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగర పంచాయతీని గ్రేడ్ -2 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం శుభ పరిణామని టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. రోడ్లు, డ్రైన్లు మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి వసతి, పార్కుల సుందరీకరణ, రైతు బజార్ల ఏర్పాటు ఇలా దర్శి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ కార్యాలయ భవనానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన 10 నెలల కాలంలో రూ.4 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. త్వరలో మినీ స్టేడియం రూపుదిద్దుకోనుందన్నారు. సెంట్రల్ లైటింగ్ , డివైడర్లు మార్పుల ఆధునీకరణ లాంటి సుందరీ కరణ పనులు చక చకా జరుగుతున్నట్లు తెలిపారు. .దర్శిని గ్రేడ్-2 అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకి గొట్టిపాటి లక్ష్మమని ధన్యవాదాలు తెలిపారు.

ఆధిపత్య గొడవతోనే..

(మొదటిపేజీ తరువాయి)

ఇసుక వ్యాపారాలు చేస్తూ నేరచరిత్ర ఉన్న వినోద్ అనే ఇద్దరు హత్యలో ప్రధాన కుట్రదారులుగా ఉన్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన కిరాయి హంతకులకు డబ్బులు ఇచ్చిన ఈ హత్య చేయించారు. అమ్మనబ్రోలుకు చెందిన వీరయ్యచౌదరి క్రియాశీలక నేతగా ఉన్నారు. ఆయనకు లిక్కర్ రియల్‌ఎస్టేట్ వ్యాపారాలూ ఉన్నాయి. గ్రామంలో వీరయ్యకు అనుచరులుగానే ఉన్న కొందరు ఆయనతో విభేదించారు. రాజకీయంగానూ, వ్యాపారాల్లో వారి మధ్య మనస్పర్ధలు వచ్చాయి. దీంతో ఆళ్ల సాంబయ్య, తన మేనల్లుడు ముప్పా సురేష్ ఒక వర్గంగా ఉన్నారు. 2010 నుంచి వీరి మధ్య అన్ని రకాలుగా ఆధిపత్య పోరు కొనసాగుతోంది. 2021 పంచాయతీ ఎన్నికల్లో గ్రామంలో వీరయ్య చౌదరి ఒకరిని పోటీలో పెట్టగా సాంబయ్య మరొకరిని పోటీలో పెట్టారు. కోటీ 20 లక్షల రూపాయలు సేకరించి సాంబయ్య తను పెట్టిన నేతను గెలిపించారు. ఈ క్రమంలో ఇసుక వ్యాపారం చేసుకుంటున్న వినోద్ అనే వ్యక్తి సాంబయ్యకు పరిచమయ్యాడు. అదే గ్రామానికి చెందిన తోట శ్రీను అనే వ్యక్తితో వినోద్ అమ్మనబ్రోలులో అడుగుపెట్టాడు. వినోద్‌తో సాంబయ్యకు పరిచయమైంది. వీరి మధ్య వ్యాపార సహకారాలు పెరిగాయి. వీరయ్యచౌదరి ఒకసారి వినోద్ ఇసుక ట్రాక్టర్ పట్టించినప్పుడు సాంబయ్య సహకారంతో ఫైన్ కట్టి బయటకు తెచ్చారు. ఇలా వీరి మధ్య పరిచయాలు పెరిగాయి. వినోద్‌కు పాత నేరస్తులతోనూ పరిచయాలున్న తరుణంలో చెన్నయ్‌లో వినోద్ అనే వ్యక్తి సాంబయ్య మేనల్లుడికి రూ.9 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. అక్కడకు వెళ్లి వినోద్ తన స్నేహితులతో కలిసి బెదిరించినట్లు దర్యాప్తులో తేలింది. హైదరాబాద్ వెళ్లి ముప్పా సురేష్‌తోనూ గతంలో భేటీ అయ్యారు. గ్రామంలో వీరయ్యతో పేచీలు పెరిగిన నేపథ్యంలో భవిష్యత్‌లో రాజకీయంగా తన మేనల్లుడు ముప్పా సురేష్‌కు భవిష్యత్ ఉండదని భావించి వీరయ్యను అంతమొందించేందుకు కుట్ర పన్నారు. దాన్ని వినోద్‌కు చెప్పగా అంగీకరించారు. తనకు బాకీగా ఉన్న రూ.10 లక్షలు ఇవ్వాల్సిన అవసరం లేదని సాంబయ్య వినోద్‌కు చెప్పారు. హత్య చేశాక ఎక్కువమొత్తంలో నగదు ఇస్తామని ఆశ చూపారు. పాత నేరస్తులను రంగంలోకి దింపారు. నెల్లూరుకు చెందిన నలుగురిని హత్యకు పురమాయించారు. వారిని ఒంగోలుకు రప్పించి అన్ని సౌకర్యాలూ కల్పించారు. వాహనాలు, కత్తులు ఇచ్చారు. ఒక చోట బస కల్పించి వారితో రెక్కీ నిర్వహించారు. గత నెల 22న పథకం ప్రకారం నలుగురూ కలిసి వీరయ్య ఆఫీసులోకి వెళ్లి కత్తులతో దారుణంగా 50కి పైగా పోట్లు పొడిచి పరారయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన ఎస్పీ దామోదర్ బృందాలను ఏర్పాటు చేశారు. చీమకుర్తి వైపు వెళ్లినట్లు నేరస్తులను గుర్తించారు. వాళ్లు వదిలిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వెంటనే గ్రామంలో వీరయ్యకు రాజకీయంగా వ్యతిరేకంగా ఉన్నవారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తమదైన శైలిలో విచారించగా కుట్ర వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో పెద్ద చర్చ సాగిన దేవేంద్రనాథ్ ప్రమేయం లేదని ఎస్పీ దామోదర్ వెల్లడించారు. కుట్ర జరుగుతుందని వినోద్ ఒకరోజు కలిసి వివరించగా అలాంటివి తనకు చెప్పొద్దని చెప్పి అప్పటినుంచీ వీరితో సంబంధం లేకుండా ఉన్నాడని చెప్పారు. అయితే కుట్ర జరుగుతుందని తెలిసి బయటకు చెప్పనందునే ఈ కేసులో ఆయన్న కూడా ముద్దాయిగా చేర్చామన్నారు.

అరెస్టయిన నిందితులు వీళ్లే..

వీరయ్య హత్య కేసులో ఇప్పటివరకూ 9 మంది నిందితులను అరెస్టు చేశారు. వారిలో ఒంగోలుకు చెందిన బోర్లగుంట వినోద్ కుమార్, నెల్లూరుకు చెందిన తువ్వర వంశీ, బెల్లంకొండ వెంకటగౌతం, మన్నంతేజ, ఒంగోలుకు చెందిన మార్టూరి కిరణ్‌కుమార్, చీమకుర్తికి చెందిన షేక్ సమీర్, అమ్మనబ్రోలుకు చెందిన ఆళ్ల సాంబయ్య, వీరగంధం దేవేంద్రనాథ్ చౌదరి, నాగులుప్పలపాడు మండలం దాసరివారిపాలెంకు చెందిన తోట శ్రీనివాసరావును బుధవారం ఆరెస్టు చేశారు. వారి నుంచి 7 సెల్‌పోన్లు, మూడు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఈ కేసులో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. వారిలో ముప్పా సురేష్, ఓబిలి నాగరాజు, గోళ్ల రుష్యేంద్రబాబు ఉన్నారు.

కేసు ఛేదించిన తీరు..

హత్య కేసును ఎస్పీ దామోదర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎందుకంటే సిఎం చంద్రబాబు అమ్మనబ్రోలు వచ్చి వీరయ్య చౌదరికి నివాళులర్పించారు. దీంతో ఈ కేసు అన్ని విధాలా ప్రాధాన్యత సంతరించుకుంది. ఎస్పీ దామోదర్, అధికారులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరు పరిశీలించాక వెంటనే వీరయ్యతో రాజకీయంగా విభేదాలున్న వారిపై నిఘా పెట్టారు. వెంటనే అమ్మనబ్రోలుకు చెందిన వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు పారిపోయిన ఆనవాళ్లను గమనించారు. ఎస్పీ స్వయంగా మోటారు సైకిలుపై తిరిగి దర్యాప్తు చేపట్టారు. నిందితులు వినియోగించిన వాహనాలను గుర్తించారు. అమ్మనబ్రోలుకు చెందిన ఆళ్ల సాంబయ్యను గట్టిగా విచారించగా కథ అంతా తేలిపోయింది. వినోద్‌ను అదుపులోకి తీసుకున్నాక హత్యకు కుట్ర, వ్యూహం అన్నీ తేలిపోయాయి. దీంతో నిందితులను అదుపులోకి తీసుకోవడానికి ఈ సమయం పట్టింది. ఈ కేసులో కీలకంగా పనిచేసిన అధికారులను ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. కేసును ఛేధించడంలో కృషి చేసిన ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావుతో పాటు తాలూకా, మహిళా, చీమకుర్తి, సిసిఎస్, ట్రాఫిక్, ఐటీ కోర్, మార్కాపురం, ఒంగోలు రూరల్ సిఐలను అభినందించారు. వైపాలెం, ముండ్లమూరు, మద్దిపాడు, సంతనూతలపాడు, పెద్దారవీడు, కొత్తపట్నం, దోర్నాల స్టేషన్ల ఎస్ఐలకు ఎస్పీ అభినందనలు తెలిపారు.



జగన్‌తో పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన 'పిడతల'

ప్రజాశక్తి - గిద్దలూరు

గిద్దలూరు వైసిపి నాయకుడు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి క్యాంప్ ఆఫీస్‌లో జగన్ మోహన్ రెడ్డిని కలిసి గిద్దలూరు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను గురించి చర్చించారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కషి చేయాలని జగన్ మోహన్ రెడ్డి తనకు సూచించనట్లు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-కంభం రూరల్

మండల పరిధిలోని నర్శిరెడ్డిపల్లె గ్రామంలో గుండం మంగమ్మ, కీర్తిశేషుడు రాజు కుమారుడు పీటర్, శశికళ వివాహవేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, వైసిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నా వెంకటరాంబాబు, వైసిపి నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ప్రజాశక్తి గురువారం 15 మే 2025

భానుడి ప్రతాపం.. రోడ్లు నిర్మానుష్యం

దడ పుట్టిస్తున్న ఎండలు

ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారుల ఇబ్బందులు

ప్రజాశక్తి-కొండపి

రోహిణి కార్త దగ్గర పడడంతో భానుడి ప్రతాపం మరింత పెరిగింది. ఫిబ్రవరి చివరి నుంచి ఎండలు బాగా తీవ్రంగా ఉన్నాయి. ప్రతిరోజు 30 డిగ్రీల నుంచి 37 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటుంది. బుధవారం భానుడి భగభగలకు ప్రజలు మరింత ఉక్కిరిబిక్కిరయ్యారు. మండుటెండలతో ప్రజలు బెంబేలెత్తిపోయి సాయంత్రం ఐదు గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది.

ఉక్క పోతతో ఇబ్బంది పడిన ప్రజలు

భానుడు భగ భగమనడంతో పాటు గాలి లేక ఉక్కపోతతో వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతలు తీవ్ర



తీవ్రమైన ఎండకు నిర్మానుష్యంగా మారిన రోడ్డు

ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భానుడి ప్రతాపంతో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొండపి రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనుల్లో ఉన్నవాళ్లు ప్రయాణం చేయాలంటే హడలిపోతున్నారు. ప్రయాణ సమయంలో వడగాలికి బీతిల్లిపోతున్నారు. ఫ్యాన్లు, ఏసీల కింద కూర్చున్నా ఫలితం దక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఫ్యాన్లు తిరుగుతున్న ఉక్కపోతుతో, చెమటలతో, పొడగాల్పులతో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ వేడిమికి బయటకు వచ్చిన ప్రజలు సేద తీర్చుకోవడానికి శీతల పానీయాల వైపు చూస్తుండడంతో కూల్ డ్రింక్స్ జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు, తాటి ముంజకాయలకు డిమాండ్ బాగా పెరిగింది.

తిరునాళ్లకు ముస్తాబవుతున్న ప్రభలు

ప్రజాశక్తి-పీసీపల్లి

మండలంలోని వెంగళాపురంలో 16న జరగనున్న తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు ముస్తాబు అవుతున్నాయి. మొత్తం తొమ్మిది విద్యుత్ ప్రభలు, కోలాటం కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు మంత్రిని, జిల్లా నాయకులను ఆహ్వానిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ద్వారా మంత్రులకు సిఫారసు కూడా చేస్తున్నారు. ప్రతిపక్ష నాయకులు జడ్పీ చైర్మన్‌ని జిల్లా పార్టీ అధ్యక్షుడిని ఆహ్వానిస్తున్నారు. గంగమ్మ తిరునాళ్ల మంగళవారం నుంచి ప్రారంభమైనప్పటికీ, 16న శుక్రవారం రాత్రి జరిగే విద్యుత్ ప్రభలు, కోలాటం కార్యక్రమాలు ముఖ్యమైనవి. ఆ రోజు సుమారుగా లక్షకు పైగానే భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ సంవత్సరం 9 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేయటంతో వచ్చే భక్తుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. కానీ ఈ సంవత్సరం పోటాపోటీగా ఇరుపార్టీలవారు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేయడంతో బంధువులను స్నేహితులను పార్టీ వారిని కూడా రావాలంటూ ఆహ్వానం పంపుతున్నారు.



ఏర్పాటు చేస్తున్న తడికల ప్రభ

వచ్చే భక్తులకు రాజకీయాలకు అతీతంగా కులాలు సత్రాలు భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. ఈపాటికే రెడ్డి, కమ్మ, యాదవ, వడియరాజులు, బ్రాహ్మణ, వైశ్య, వీర క్షత్రియ తొగట కులాల వారీగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం పోతవరం సర్పంచ్ రావి రాజా ఆధ్వర్యంలో పురాతన కాలంలో మాదిరిగా వుండే తడికల విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. వడ్డేంపూడి వెంకటరావు ఆధ్వర్యంలో మరో తడికల విద్యుత్ ప్రభను కూడా ఏర్పాటు చేశారు. ఈ ప్రభల ఏర్పాట్లు గత వారం రోజులుగా జరుగుతోంది. సుమారు 20 మంది ఒక్కో ప్రభ వద్ద పని చేస్తున్నారు. మిగతా ఏడు ప్రభలు 16వ తేదీన అప్పటికప్పుడు తయారు చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం సుమారు 2 వేల మంది విద్యుత్ ప్రభల వద్దకు వచ్చారు. ఇరు పార్టీల వారు పోటాపోటీగా ఫ్లెక్సీలు జెండాలను ఏర్పాటు చేశారు. పార్టీల తరపున ప్రభలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ ప్రజలు మాత్రం అన్ని ప్రభల వద్దకు వెళ్లి అందరితో మాట్లాడుతూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. గంగమ్మ గుడి ఆవరణ మొత్తం ఫ్లెక్సీలతో, ఫోటోలతో నిండిపోయింది. పెద అలవలపాడు నుండే రోడ్డుకి ఇరువైపులా అధికార పార్టీ, ప్రతిపక్షం వారు జెండాలతో ఫ్లెక్సీలతో నింపివేశారు.

గంగ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు: డీఎస్పీ

కనిగిరి: పీసిపల్లి మండలంలోని వెంగళాపురంలో ఈనెల 16న జరిగే పాలేటి గంగమ్మ తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ కోరారు. కనిగిరిలోని తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరునాళ్లకు తొమ్మిది ప్రభలు, ఒక కోలాటం కార్యక్రమాలు ఏర్పాటు చేసినందున ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టామన్నారు. తిరునాళ్లకు వచ్చే ట్రాక్టర్లు, కార్లు, బైకులు పోలీసులు నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు. తిరునాళ్ల సందర్భంగా మే 16వ తేదీన



మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి మూడు గంటల వరకు కనిగిరి నుంచి కందుకూరు వైపు వెళ్లే వాహనాలను పామూరు మీదుగా కందుకూరు వెళ్లాలన్నారు. అలాగే కందుకూరు నుంచి కనిగిరి వచ్చే వాహనాలు కూడా పామూరు మీదుగా కనిగిరి రావాలని సూచించారు. కనిగిరి వైపు నుంచి వచ్చే వృద్ధులు, దివ్యాంగులు మరియు చంటి బిడ్డ తల్లులకు వాహనాలు పార్కింగ్ చేసే ప్రదేశం నుంచి గంగమ్మ తల్లి గుడి వరకు పిసిపల్లి పోలీస్ వారిచే ఉచిత ఆటో సర్వీస్ సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నో పార్కింగ్ జోన్‌లో పార్కింగ్ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రబల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా ముందు జాగ్రత్తగా కమిటీ సభ్యులను తహశీల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరిగిందన్నారు. సౌండ్ అధికంగా పెట్టడం, అశ్లీల నృత్యాల ప్రదర్శన, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం కానీ చేయరాదన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ఆరు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టామన్నారు. ఒక డీఎస్పీ, ఆరు మంది సిఐలు, 23 మంది ఎస్ఐలు , 200 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో కనిగిరి సీఐ ఎస్.కె కాజావలి పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలి

ఎంపీడీవోకు దళిత నాయకుల వినతి

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో అంబేద్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలని దళిత నాయకులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక భవనం కోసం స్థలం కేటాయించి భవన నిర్మాణం చేయాలని దళిత సంఘాల నాయకులు ఆందోళన చేస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. అనేకసార్లు అనేక సందర్భాలలో అర్జీలు స్వీకరిస్తున్నారు.. హామీలుస్తున్నారు కానీ సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సేన నియోజకవర్గ అధ్యక్షులు గర్నిపూడి ప్రేమ్ కుమార్, రాష్ట్ర నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పు కళాకారుల పోరాట సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల గోవింద్ ప్రసాద్ మాదిగ, వంగేపురం దేవయ్య, గోళ్ళపాటి మార్కు, అచ్చయ్య మాదిగ, ఎస్సీ సర్పంచులు ఓనుము విజయ్, దాసరి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు

బాలకృష్ణను కలిసిన సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో హిందూపురం ఎమ్మెల్యే, బసవ తారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మెన్ నందమూరి బాలకృష్ణను మర్యాద పూర్వకంగా రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మెన్ దామచర్ల సత్యా కలిశారు. అంతకు ముందు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటి, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన కడపలో నిర్వహించబోయే మహానాడు గురించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దామచర్ల సత్యా పాల్గొన్నారు. కడపలో పండుగ వాతావరణంలో మహానాడు నిర్వహించాలని నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహానాడు కమిటీ కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.



బాలకృష్ణతో దామచర్ల సత్య



ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

వృద్ధురాలి కళ్లల్లో కారం కొట్టి...

బంగారు ఆభరణాలు అపహరణ

ప్రజాశక్తి-మార్కాపురం

వృద్ధురాలి కళ్లల్లో కారం కొట్టి.. ఆపై దాడి చేసి రూ.10 లక్షల విలువైన బం గారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరిం చారు. ఈ సంఘటన మార్కా పురం పట్టణంలో బుధవారం తెల్లవారు జామున జరిగింది. పట్టణంలో అన్న క్యాంటిన్ వెనుక గల రావి వెంకటరెడ్డి బజారులో బండి రమణమ్మ నివాసం ఉంటోంది. ఆమె నిద్రిస్తున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మోటార్‌బైక్ వచ్చారు. వెంట తెచ్చుకున్న కారం ప్యాకెట్‌ను ఆమె కళ్లలో కొట్టారు. ఆమె చేతికి ఉన్న నాలుగు బంగారు గాజులు, మెడలోని బంగారు సరుడు లాక్కున్నారు. ఆ సమయంలో వృద్ధురాలు రమణమ్మ, గుర్తు తెలియని దుండగులతో పెనుగులాటలో ఆమెపై పడిగుద్దులు మ్రోగించారు. ఇదంతా క్షణాల్లో జరిగింది. కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తున్నారు. ఘర్షణ వాతావరణంతో కుటుంబీకులు నిద్రలేచే లోగా గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి మోటార్ బైక్‌పై పారిపోయారు. తస్కరించిన ఆభరణాలు రూ.10 లక్షల విలువ ఉంటుందని అంచనా. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ డాక్టర్ ఎం.రాజమోహన్‌రావు కేసు నమోదు చేశారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కురిచేడు

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కురిచేడు గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉలవల వెంకటేశులు (22) స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కాంట్రాక్ట్ బేస్ అటెండర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు లెస్ఐ ఎం.శివ తెలిపారు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

సీసీ కెమెరాలు బాధ్యతగా తీసుకొని ఏర్పాటు చేసుకోవాలని శింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్య అన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయం వద్ద 'మీ భద్రత మా బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఇప్పటికే పోలీసుల సూచనలతో చాలాచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వ్యాపారులు ప్రజలు సహకరించి పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా ఏదైనా నేరం జరిగితే వెంటనే ఛేదించవచ్చన్నారు. ఈ వాల్ పోస్టర్‌ను ప్రతి ఇంటికి అంటించాలని మహిళా కానిస్టేబుళ్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.మహేంద్ర, ఏఎస్ఐ బేగ్ తదితరులు ఉన్నారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి డిపో నుంచి సరస్వతీ పుష్కరాల సందర్భంగా ఈనెల 17, 23 తేదీలలో రాత్రి తొమ్మిది గంటలకు సూపర్ లగ్జరీ బస్ సర్వీస్ నడపడం జరుగుతుందని డిపో మేనేజర్ సయానా వేగం బుధవారం తెలిపారు. యాత్రలో కాలేశ్వరం, రామప్ప దేవాలయాలు, వరంగల్ భద్రకాళి, వేయి స్తంభాల గుడినీ దర్శించవచ్చునని తెలిపారు. టిక్కెట్టు ధర రూ.2210/-గా ఉంటుందని కావున యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.


విద్యార్థినిని సన్మానిస్తున్న ఎంఎల్‌ఎ కొండయ్య

విద్యార్థినికి ఎమ్మెల్యే కొండయ్య సత్కారం

ప్రజాశక్తి - వేటపాలెం

10వ తరగతి ఫలితాల్లో డిస్టిక్ మొదటి ర్యాంక్ సాధించిన సజ్జా దివ్యశ్రీని శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య బుధవారం సన్మానించి రూ.5వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలను ఉపాధ్యాయులు వెలుగుతీసి ప్రోత్సహించాలని అన్నారు. సజ్జ దివ్యశ్రీ నియోజకవర్గ పరిధిలోని పందిల్లపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యను అభ్యసించి జిల్లా స్థాయిలో నిలవటం తనకు గర్వకారణంగా ఉందన్నారు ఉన్న చదువుల్లో కూడా రాణించి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో ఆవుల అశోక్ కుమార్, దోగుపర్తి బాలకృష్ణ పాల్గొన్నారు


ఒప్పంద పత్రాన్ని చూపుతున్న కళాశాల యాజమాన్యం


కెకె ప్రింటర్స్‌తో ఒప్పందం

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీ కెకె ప్రింటర్స్‌తో అవగాహన ఒప్పందం కుదిరినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె జగదీష్ బాబు మాట్లాడుతూ కళాశాల్లోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్‌కు సంబంధించిన కన్సల్టెన్సీ సెల్ నుండి కెకె ప్రింటర్స్‌కు సాఫ్ట్వేర్‌ను అభివృద్ధి చేసి సాఫ్ట్వేర్ నిర్వహణను అందిస్తున్నట్లు తెలిపారు. సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ పి హరిణి మాట్లాడుతూ ఈపాటికే కళాశాల నుండి సాఫ్ట్వేర్ డెవలప్మెంట్‌కి సంబంధించి పలువురితో అవగాహన ఒప్పందాలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం మునుగడలోని లేటెస్ట్ టెక్నాలజీతో సాఫ్ట్వేర్లను డెవలప్ చేసి ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఫస్ట్ ఇయర్ కో ఆర్డినేటర్ ఎస్ అమర్నాథ్ బాబు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులు 'తలపనేని'కి పితృవియోగం

ప్రజాశక్తి - పంగులూరు


హనుమయ్య (97)

సిపిఎం కార్యదర్శి తలపనేని సుబ్బారావు తండ్రి తలపనేని హనుమయ్య (97) మంగళవారం రాత్రి పంగులూరులోని ఆయన స్వగృహంలో మరణించారు. వృద్ధాప్యం కారణంగా వచ్చిన అనారోగ్యంతో కొంత కాలంగా బాధపడుతున్న ఆయన మృతిచెందారు. హనుమయ్య మొదటి నుండి పంగులూరులో సిపిఎంకు సానుభూతిపరునిగా పార్టీకి ఆయన కుటుంబం అండదండలుగా నిలిచింది. ఆయన పెద్ద కుమారుడు సుబ్బారావు 40ఏళ్ల నుండి సిపిఎం నాయకునిగా ఉన్నారు. ప్రస్తుతం సుబ్బారావు సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. మృతి చెందిన హనుమయ్యకు భార్య బుల్లెమ్మ, ముగ్గురు కుమారులు ఉండగా ఇద్దరు కుమారులు గతంలోనే మరణించారు. హనుమయ్య మృతదేహాన్ని సిపిఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు, సిపిఎం జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు, తల్లపనేని రామారావు, రాయిని వెంకట సుబ్బారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు బుధవారం పంగులూరులో జరిగాయి.

సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - అద్దంకి

ఈనెల 20న జరుగనున్న జాతీయ సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. సిఐటియు, మున్సిపల్ వర్కర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలు రద్దు చేసి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి ఆదాం, గాలి భీష్మ, అలివేలమ్మ, జ్యోతి, వెంకటరావు, ఇంజనీరింగ్ విభాగం నాయకులు ఉసురుపాటి సామేలు, జాను పాల్గొన్నారు.


సమ్మె నోటీసు ఇస్తున్న తంగిరాల వెంకటేశ్వర్లు

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో కౌలు వ్యవసాయం చేసే కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తహశీల్దారు పి సింగారావు అన్నారు. మండలంలోని కొండ మంజులూరులో బుధవారం నిర్వహించిన కౌలు రైతుల గ్రామసభలో ఆయన మాట్లాడారు. కౌలు కార్డుల ద్వారా కౌలు రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాల్లో సబ్సిడీలు, ప్రభుత్వం నుండి పంట నష్ట పరిహారాలు, పంట రుణాలు, భీమా తదితర ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. కౌలు రైతులందరూ కౌలు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మండలంలో గతేడాది 2200 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వగా ఈ సంవత్సరం 2500 మందికి గుర్తింపు కార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. భూ యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, భూ యజమాని, కౌలు రైతు ఇద్దరికీ ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కౌలు రైతులు తక్షణమే గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో ఎఒ, విఆర్‌ఒను కలిసి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎఒ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయంలో కౌలు రైతుల పాత్ర కీలకంగా మారిందని, అందువలన కౌలు రైతులు తక్షణం గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్వేత, విఆర్ఒ వెంకటేశ్వర్లు, విఎఎ శైలేష్, స్థానిక తెలుగుదేశం నాయకులు చింతల సహదేవుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దారు సింగారావు

నీటి పన్ను వసూలు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న బాపట్ల ఆర్‌డిఒ పి గ్లోరియ

ప్రజాశక్తి - పర్చూరు

నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని బాపట్ల ఆర్డీఓ గ్లోరియా అధికారులను ఆదేశించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. భూముల రీ సర్వేని వెంటనే పూర్తి చేయాలని అన్నారు. మండలంలోని రమణాయపాలెం, వీరన్నపాలెం గ్రామాల్లో జరిగిన భూముల రీసర్వే గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే రైతుల సమక్షంలోనే చేయాలని అధికారులకు గట్టిగా చెప్పారు. కార్యక్రమంలో పర్చూరు తహశీల్దారు బ్రహ్మయ్య, డిఐ పాల్గొన్నారు.

వేమూరు : రైతుల నుండి నీటి తీరవా శిస్తు వసూళ్లను విఆర్‌ఒలు, సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి సూచించారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ సిబ్బందితో బుధవారం సమీక్షించారు. తహశీల్దారు సుశీల అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ విఆర్‌ఒలు ఎప్పటికప్పుడు రైతులతో కలిసి మాట్లాడి లక్ష్యానికి అనుగుణంగా వసూలు చేపట్టాలని అన్నారు. ప్రతిరోజు జరిగే వసూళ్ల సమాచారాన్ని తాసిల్దార్ ద్వారా తమ కార్యాలయానికి అందించాలని అన్నారు. ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖ ద్వారా గృహాలు మంజూరు చేస్తున్న దృష్ట్యా అవసరమైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈపాటికే దరఖాస్తు చేసుకొని పేర్లు మంజూరైన వారికి పొజిషన్ సర్టిఫికెట్లు పరిశీలించి అందించాలని అన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఒ రామలక్ష్మి

సాగుదారు హక్కు పత్రాలపై సదస్సు

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని కారంచేడు -2 సచివాలయం పరిధిలో పంట సాగు దారుల హక్కు పత్రాలపై అవగాహన సదస్సు బుధవారం ఏర్పాటు చేశారు. తహశీల్దారు జి నాగరాజు మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు కార్డు తీసుకోవడం వల్ల ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కౌలు రైతు చట్టం 2019 ప్రకారం కార్డు తీసుకున్న రైతుకు 11 నెలల వరకు పండించే పంటపై హక్కు కలిగి వుంటారని తెలిపారు. ఈ పత్రాల వలన పంటల భీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం, వ్యవసాయ రుణాలు తదితర ఉపయోగాలను ఎఒ కె సుధీర్ బాబు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ జగదీష్, విఆర్ఒ కోటేశ్వరరావు, విఎఎ జ్యోతి, భవాని, లలిత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కారంచేడు తహశీల్దారు నాగరాజు


వేసవి క్యాంపులో విద్యార్థులు

విద్యార్థులకు జెవివి వేసవి శిక్షణ

ప్రజాశక్తి - బాపట్ల

భావపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సఘాల కార్యాలయంలో జెవివి వేసవి శిక్షణ రెండో రోజు నిర్వహించారు. క్యాంపులో బివి శ్రీనివాసరావు మాస్టర్ చిన్నారులకు యోగ, ప్రాణాయామం నేర్పించారు. వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు వివరించారు. నక్షత్రాల్లాంటి అక్షరాలు ఎలా నేర్చుకోవాలో మెళకువలు వివరించారు. 100 నుండి ఒకటి వరకు రివర్స్ చెప్పించడం ద్వారా పిల్లల ఏకాగ్రత పెంచడానికి సహాయపడుతుందని అన్నారు. ఫొటో ఫ్రేమ్ తయారీని విద్యార్థులకు నేర్పించారు.

ఆదర్శ విద్యార్థికి రాష్ట్ర ర్యాంకు

ప్రజాశక్తి - ఇంకొల్లు


విద్యార్థిని గాయత్రి

స్థానిక ఆదర్శ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని అన్నెం గాయత్రీకి పాలీసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 605వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ తెలిపారు. 120 మార్కులకు 114 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఏప్రిల్ 30న నిర్వహించిన పాలీసెట్ పరీక్షకు 1.33లక్షల మంది హాజరయ్యారు. 10వ తరగతి పరీక్షల్లో ఆమె 586 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితం సాధించిన విద్యార్థినిని ఆయనతోపాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.


వేస్ట్ పికర్ల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

వేస్ట్ పిక్కర్ల నమోదు ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే వేస్ట్ పిక్కర్లకు సాధికారత కల్పించేందుకు సమగ్ర నమోదు కార్యక్రమం స్థానిక పోస్ట్ ఆఫీస్ సమీపంలోని మున్సిపల్ మస్టర్ కేంద్రం నుండి కమిషనర్ డి రవీంద్ర బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ యాక్షన్ ఫర్ మేకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం పథకం అనేది పొడి వ్యర్థాలను ఏరుకునేవారు, అనధికార పారిశుధ్య కార్మికులు, వృత్తి పరమైన గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు కల్పించేందుకు తోడ్పడుతుందని అన్నారు. వృత్తికి అవసరమైన పిపి కిట్లు నమోదు చేసుకున్నవారికి అందజేయనున్నట్లు తెలిపారు. ఆధార్ లేని వేస్ట్ పిక్కర్లకు ఆధార్ కార్డులు తీయిస్తామని తెలిపారు. జీరో బ్యాంక్ అకౌంట్, ఈ శ్రమ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు అందే విధంగా చేయడమే పథకం లక్ష్యమని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే వేస్ట్ పిక్కర్ల పిల్లలకు ఫీజులు చెల్లిస్తామని తెలిపారు. దళిత రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్లు వి భగవాన్ దాస్ , దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో చెత్త కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, జుట్టు సేకరించే వాళ్ళు వందల మంది ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వారి వివరాలు నమోదు చేసి సామాజిక భద్రత పథకాల్లో భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుండి అమలయ్యే సామాజిక సంక్షేమ పథకాలు పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 40మందిని నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ బలరామిరెడ్డి, డిబిఆర్సి వాలంటీర్లు దార్ల అవర్ణ, వెంకటేశ్వర్లు, శ్రీరామ్ పాల్గొన్నారు.



ముఠా కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

20న సమ్మెలో పాల్గొనాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో పాల్గొనాలని ముఠా కార్మికులు పిలుపునిచ్చారు. బుధవారం నాడు ఒంగోలు కొత్త కూరగాయలు మార్కెట్ వద్ద ముఠా వర్కర్లను ఉద్దేశించి సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసరావు మాట్లాడారు. ముఠా కార్మికుల 'వెల్ఫేర్ బోర్డు' సాధన కోసం మే 20 న జరిగే సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఐఎల్ఓ (ఇంటర్ నేషనల్ లేబర్ ఆర్గనైజషన్) నిబంధనలను అనుసరించి అధిక బరువులు మోయడం నిషేధం అయినప్పటికీ, ఇప్పటికి 100 కేజీల బరువులు మోయిస్తున్నారని ఆరోపించారు. ముఠా కూలీలకు ఎటువంటి రక్షణ చట్టాలు అమలు కాకపోవడం అన్యాయమన్నారు. సంవత్సరాల తరబడి పనిచేసినప్పటికీ పిఎఫ్, ఇఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. వద్ధాప్యంలో అనారోగ్యం పాలై ఆదరణ కరువై ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబ నిర్వహణ భారమై, ప్రభుత్వాల సహాయం కోసం ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఠా కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ వంటి పథకాలు వర్తింపజేయాలని, నిత్యావసర సరుకులు ధరలు తగ్గించాలని కోరారు. ముఠా కార్మికులు 'రక్షణ వెల్ఫేర్ బోర్డు' ఏర్పాటు చేయాలని, కార్మికులందరినీ భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన ముఠా కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులందరికీ వర్తింపజేయాలని కోరారు. పై డిమాండ్ల కోసం జరిగే సమ్మెలో అన్ని వర్గాల ముఠా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాంచార్యులు, జనార్ధన్, సుబ్బారావు, వెంకట్రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దిగజారుతున్న పొగాకు ధరలు

మూడో వంతు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పొగాకు ధరలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. ధర ఎలా ఉన్నప్పటికీ మూడో వంతు తిరస్కరిస్తున్నారు. బుధవారం నాడు రీజియన్ పరిధిలో 6997 బేళ్లు ఆక్షన్‌కి రాగా 4790 బేళ్లు అమ్ముడుపోయాయి. 2207 బేళ్లను (31.54 శాతం) తిరస్కరించారు. జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు ఐటిసి కంపెనీ ప్రతినిధులతో చర్చించిన రెండో రోజే ఇటువంటి పరిస్థితి చేసుకోవడం గమనార్హం. బ్లాక్ సాయిల్ పరిధిలోని ఒంగోలు 1, 2, వెల్లంపల్లి, టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల్లో 4295 బేళ్లు ఆక్షన్‌కు తేగా 2,959 బేళ్లు కొనుగోలు చేశారు. ఇక్కడ గరిష్ట స్థాయిలో 1113 బేళ్లు తిరస్కరించారు. కిలో రూ.కనిష్ఠ ధర రూ.205, గరిష్ట ధర రూ.280 పలికింది, సగటున కిలో రూ.240 పలికింది. కాగా లైట్ సాయిల్ పరిధిలోని పొదిలి, కనిగిరి, కందుకూరు 1, 2 కలిగిరి, డిసి పల్లి కేంద్రాల్లో 2702 బేళ్లు ఆక్షన్‌కు తేగా 1831 బేళ్లు కొనుగోలు జరిగాయి. 712 బేళ్లు తిరస్కరించారు. ఇక్కడ కిలో కనిష్ఠ ధర రూ.200 కాగా, గరిష్ట ధర రూ 280 పలికింది. సగటున కిలో రూ.244 పలికింది.

షేక్ రియాజ్‌ను ఘన సత్కారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



రియాజ్‌ను సత్కరిస్తున్న రాంబాబు, రవిశంకర్

ఆంధ్రప్రదేశ్ లైక్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌ను జనసేన, టిడిపి నాయకులు ఘనంగా సత్కరించారు. రియాజ్‌కు పదవి వచ్చిన సందర్భంగా జనసేన పార్టీ జిల్లా నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త కంది రవిశంకర్ ఆధ్వర్యంలో ఒంగోలు రవిప్రియా మాల్‌లో అభినందన సభ బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్లు శింగరాజు రాంబాబు గారు, కామేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇద్దరం కలిసి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని తెలియజేశారు. శింగరాజు రాంబాబు మాట్లాడుతూ షేక్ రియాజ్ తనకు మొదటి నుంచి మంచి మిత్రుడని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. అటువంటి వ్యక్తికి పదవి రావటం ఆనందంగా ఉందన్నారు. ఏఎంసి మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చిట్టెం ప్రసాద్, దేవళ్ళ భాస్కరరావు, శంకర్ శెట్టి చిరంజీవి, కొండారు వెంకటేష్ పాల్గొన్నారు.



ఆటోలతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

పర్మినెంట్ ఆటోస్టాండ్ ఏర్పాటుచేయాలి

ఒంగోలులో ఆటోలతో ప్రదర్శన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు-ఎం.నిడమానూరు రూట్ ఆటో కార్మికులకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద పర్మినెంట్ ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం నాడు ఒంగోలు-ఎం నిడమానూరు రూట్ ఆటో డ్రైవర్లు ఆర్‌టిసి బస్సు స్టాండ్ వద్ద పర్మినెంట్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. బస్టాండ్ నుంచి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, అనంతరం మున్సిపల్ ఆఫీస్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి ఆర్టీసీ డిపో వద్ద మార్కెట్ రోడ్డులో స్టాండ్ ఏర్పాటు చేసుకొని.. ఆటోలు తిప్పుకుంటున్నట్లు పేర్కొన్నారు. అయితే సదరు రోడ్డు సిమెంట్ రోడ్డుగా అభివద్ధి పరిచి, డివైడర్లు ఏర్పాటు చేయడం వల్ల ఆటోలు నిలుపుకునేందుకు స్థలం లేని కారణంగా ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఆటో కార్మికులకు పర్మినెంట్ స్టాండ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంగా ఉన్న ఒంగోలు లక్షలాది జనాభాతో నిత్యం ప్రజావాసరాలకు రవాణా సాధనం ఆటోలేనని, ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లభించక వేలాది మంది ఆటోలపై ఆధారపడి



కమిషనర్‌కు సమస్య వివరిస్తున్న నాయకులు

జీవిస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు ఖాళీగా ఉన్న స్థలాలు పరిశీలించి అనువైన చోట్ల ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఆటో కార్మికుల జీవన ఉపాధిని దెబ్బతీసే ప్రయత్నం చేయరాదన్నారు. అనంతరం ట్రాఫిక్ సిఐ వై పాండురంగారావుతో ఆటో యూనియన్ అధ్యక్షులు జాజుల వెంకటేశ్వర్లు, గాంధీ చర్చించారు. ఒంగోలు నగరంలో ప్రధానమైన కూడళ్ళలో 'ఆటో స్టాండ్లు' ఏర్పాటు చేయాలని కోరుతూ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ సిఐ పాండురంగారావుకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఇద్దరు అధ్యాపకులకు వీసీ ప్రశంసలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న వీసీ

దక్షిణ కొరియా 'హెవెన్లి కల్చర్ వరల్డ్ పీస్ రీస్టోరేషన్ ఆఫ్ లైట్ సంస్థ' ద్వారా శిక్షణ పొందిన ఇద్దరు యూనివర్సిటీ అధ్యాపకులను వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ డివిఆర్.మూర్తి బుధవారం నాడు ప్రశంసించారు. ప్రపంచ శాంతికోసం దక్షిణ కొరియా దేశంలోని సియోల్ కేంద్రంగా పనిచేస్తున్న 'హెవెన్లి కల్చర్ వరల్డ్ పీస్ రీస్టోరేషన్ ఆఫ్ లైట్' సంస్థతో రాష్ట్రంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ మార్చి, 2025లో వి.సి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి హరిబాబు హెచ్.డబ్లు.పి.ఎల్ సంస్థలోని ప్రపంచ శాంతి విభాగం ప్రతినిధులతో ఎం.ఓ.యూ కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తన 16వ పీస్ ఎడ్యూకేటర్ ట్రైనింగ్ కార్యక్రమంలో ప్రపంచంలోని 10 దేశాల నుంచి విద్యావేత్తలు పాల్గొనగా, భారతదేశం తరుపున ఆంధ్ర కేసరి యూనివర్శిటీ నుంచి ఇద్దరు విద్యా వేత్తలు ఏ.కే.యూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుత్తి రాజమోహన్ రావు, ఎం.ఎడ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ.అమతవల్లి దేవి పాల్గొనే అవకాశం దక్కింది.ఇందులో భాగంగా మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ శాంతి స్థాపనలో భాగంగా సంస్థ రూపొందించిన సిలబస్ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న విద్యా సంస్థలలో విద్యార్థులకు అవగాహన కల్పించే కషి చేశారు. దాదాపు నెల రోజుల పాటు జూమ్ విధానంలో హాజరై శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం గవించారు. ఇందుకు సంబంధించిన ప్రశంసా పత్రాలను హెచ్.డబ్ల్యు.పి.ఎల్ చీఫ్ బ్రాంచి మేనేజర్ జో హన్ కిం, జనరల్ డైరెక్టర్ యూయ్ హియాన్ చోయ్ మే 7వ తేదీన జారీ చేశారు. ఆ ప్రశంసా పత్రాలను ఏకేయూ విసి ప్రొఫెసర్ మూర్తి వారికి అందజేశారు.ఈ సందర్భంగా వారిని వీసీ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి హరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ నిర్మలా మణి, సి.డి.సి.డీన్ ప్రొఫెసర్ జి.సోమశేఖర వారిని అభినందించారు.

సరదాగా సాగిన చిల్డ్రన్ సమ్మర్ క్యాంప్

- ముగింపు సందర్భంగా అలరించిన చిన్నారుల ప్రదర్శనలు
- బాలలకు సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రకాశం బాలోత్సవం ఆధ్వర్యంలో మే 5న ప్రారంభించిన 'ఒంగోలు చిల్డ్రన్ క్లబ్' సమ్మర్ క్యాంపు బుధవారంతో ముగిసింది. ఈ క్యాంప్ 10 రోజుల పాటు సరదాగా సాగింది. బుధవారం నాడు ఎల్ బిజి భవన్ లో ముగింపు సందర్భంగా క్యాంపులో నేర్చుకున్న అంశాలను బాలలు ముగింపు సభకు హాజరైన తల్లిదండ్రులు, అతిథుల నడుమ అద్భుతంగా ప్రదర్శించారు. నేర్చుకున్న పాటలు, డాన్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్యాంపు కన్వీనర్ వినోద్ మాట్లాడుతూ విజ్ఞానం, వినోదం, వికాసం అనే పేరుతో పిల్లలు సజనాత్మకతను కలిగి ఉండాలనే లక్ష్యంతో గత మూడు సంవత్సరాలుగా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది సమ్మర్ క్యాంపులో 65 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. పిల్లల కోసం పెద్దలు ముందుకు రావాలనే ఉద్దేశ్యంతో వివిధ అంశాల్లో ప్రత్యేకత కలిగినవారు స్వచ్ఛందంగా క్యాంపులో పాల్గొని విద్యార్థులకు కొత్త విషయాలు నేర్పించిన్నట్లు చెప్పారు. 10 రోజుల పాటు మ్యాజిక్ రామన్, అబ్దుల్ మాలిక్, జ్యోతి, వీరాస్వామి, విజయ్, వినోద్ టీమ్ గా ఏర్పడి ఈ కేంద్రాన్ని నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, అధ్యక్షుడు డి.వీరాంజనేయులు, కార్యదర్శి అబ్దుల్లా హై, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి జయప్రకాష్, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.విజయ్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.



సర్టిఫికెట్లతో చిన్నారులు

పది రోజులు ఫన్నీగా..

విద్యార్థులకు బొమ్మలు గీయడంలో ఫ్రీడమ్ బర్డ్ మాల్యాద్రి మెళకువలు నేర్పారు. క్రాఫ్టింగ్‌ను ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి, వీరాస్వామి నేర్పారు. న్యూస్ పేపర్, కలర్ పేపర్ ను ఉపయోగించి వివిధరకాల బొమ్మలు తయారు చేయడం పేపర్ కటింగ్ ద్వారా పలు ఆకారాలు చేయడం వంటి క్రాఫ్టింగ్ నేర్పారు. ఫన్నీ ఇంగ్లీష్, గేమ్స్‌ను దేవరపాలెం హై స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్ శాస్త్రి, ఇంగ్లీష్ టీచర్ యామిని విద్యార్థులకు నేర్పించారు. సైన్స్ ప్రయోగాలను బాలోత్సవం కార్యదర్శి సుబ్రమణ్యం నేర్పారు. మాయలు, మంత్రాలు పేరుతో కొంతమంది అమాయకులను ఎలా మోసం చేస్తున్నారో వాటిని ఎలా గుర్తించాలో విద్యార్థులకు వివరించారు. మార్షల్ ఆర్ట్స్ ద్వారా శత్రువులు దాడి నుండి ఆడపిల్లలు ఎలా రక్షించుకోవాలో అవసరమైన టెక్నిక్‌లను, కనీసమైన రక్షణ కోసం ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో కరాటే చంద్రశేఖర్ నేర్పారు. మెమరీ టెక్నిక్ ద్వారా మనకు వసరమైన డేటాను ఎక్కువ కాలం గుర్తుంచుకోవడానికి అవసరమైన సూచనలను ఆకృతి అకాడమి ట్రైనర్ ఎస్ కె.మహబు నేర్పారు. మ్యాజిక్ క్లాసుకు సంబంధించి మ్యాజిక్ రామన్ ప్రతి విద్యార్థికీ ఒక అంశంపై తర్ఫీదు ఇచ్చారు. శాస్త్రీయ కోణంలో ఆలోచించే లక్షణాన్ని మ్యాజిక్ ద్వారా విద్యార్థులు నేర్చుకున్నారు. పాకిస్తాన్ దాడిలో మరణించిన ఏపీకి చెందిన వీర జవాన్ మురళి నాయక్ కు పిల్లల ద్వారా నివాళులర్పించారు.



విద్యార్థులకు మ్యాజిక్ నేర్పిస్తున్న రామన్

ప్రముఖుల సందేశాలు..

రిటైర్డు ఎమ్మార్వో ఇస్మాయేలు, మాంటిస్సోరి ప్రకాష్ నిరుద్దీన్, రిటైర్డు టీచర్ మాలిక్, మాల్యాద్రి, పిఎన్ఎం జ్యోతి, ఐద్వా రమాదేవి క్యాంపులో పాల్గొని విద్యార్థులకు నీతి కథలు, పాటలు, ప్రకతి వ్యవసాయం, కుటుంబ సంబంధాలు, ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు.



సింగరకొండ దేవస్థానంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం

శింగరకొండ ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ ఎం వెంకటేశ్వరరావు, ఇఒ జి వాసు పర్యవేక్షణలో దేవస్థానం కార్యనిర్వాహన అధికారి మద మంచి తిమ్మనాయుడు ఆధ్వర్యంలో భక్తులు, సిబ్బంది బుధవారం లెక్కించారు. మార్చి 15 నుండి బుధవారం వరకు స్వామివారికి భక్తులు సమర్పించిన హుండి ఆదాయం రూ.14.28 లక్షలు సమకూరినట్లు తెలిపారు. మండలంలోని పుట్టావారిపాలెం పంచాయతీ కార్యాలయం లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో గురు యాదవ్ మాట్లాడారు. ఈ గ్రామ సభలో 2025-26కు సంబంధించిన ఖరీఫ్ యాక్షన్ ప్లాన్, పెరటి తోటలు, కషాయాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను గ్రామ సభలో సన్మానించారు.




రైతులను సన్మానిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రకృతి వ్యవసాయ రైతులకు సన్మానం

ప్రజాశక్తి - సంతమాగులూరు

రైతులు అందరూ పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేసి భూమిని రక్షించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు పొందవచ్చని సర్పంచి సన్నెబోయిన గురు యాదవ్ తెలిపారు. మండలంలోని పుట్టావారిపాలెం పంచాయతీ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో గురు యాదవ్ మాట్లాడారు. ఈ గ్రామ సభలో 2025-26కు సంబంధించిన ఖరీఫ్ యాక్షన్ ప్లాన్, పెరటి తోటలు, కషాయాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను గ్రామ సభలో సన్మానించారు.



పిడుగు పడి దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

పిడుగుపాటుకు కొబ్బరిచెట్టు దగ్ధం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరం, వింజనంపాడు, పోలూరు, కుమ్మరపాలెం, యనమదల గ్రామాల్లో బుధవారం కొద్దిపాటి వర్షం కురిసింది. పూనూరు, సూరవరపుపల్లిలో ఉరుములు మాత్రమే వచ్చాయి. పోలూరు గ్రామంలో ఉరుములుతో కూడిన వర్షం పడే సమయంలో నున్న సుబ్బారావు ఇంటి పెరటిలో ఉన్న కొబ్బరి చెట్టు మీద పిడుగు పడి చెట్టు మధ్యలో తగలబడింది. కొద్దిపాటి మంటలు వచ్చి వర్షానికి ఆరిపోయింది. ఆ ఇల్లు కొద్దికాలంగా ఖాళీగా ఉంది. పెద్ద ప్రమాదం ఏమి జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు విక్రయించాలి

ప్రజాశక్తి - పర్చూరు

రానున్న ఖరీఫ్ సీజన్లో రైతాంగానికి విత్తనాలు ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువకు అమ్మ రాదని, ఎక్కువ ధరలు వసూలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎడిఎ మోహనరావు తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, యద్దనపూడిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లు, సహకార సంఘాల సొసైటీ సీఈఓలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ -25 సీజన్ ప్రారంభం అవుతున్న సందర్భంగా కంపెనీ విత్తనాలను వ్యవసాయ అధికారులకు సమాచారం ఇచ్చి అమ్మాలని పేర్కొన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతుకు బిల్లు మీద లాట్ నెంబర్, గడువు తేదీ, రైతు సంతకం తీసుకుని బిల్లు ఇవ్వాలని తెలిపారు. సొసైటీల పరిధిలో ఎరువులు రైతులకు అందించాలని తెలిపారు. ఏఓ రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ ఫామ్ ఓ ఇంక్లూసన్ చేసుకుని ఎరువులు అమ్మాలని చెప్పారు. ఇంకొల్లు ఎఒ వేణుగోపాల్ పురుగు మందుల డీలర్లు పాటించ వలసిన జాగ్రత్తలు వివరించారు. పిపిఎల్ ఎరువుల కంపెనీ చెందిన ప్రభాకర్ 36మంది ఎరువుల డీలర్లకు ఈ పోష్ మిషన్ అందించారు. ఈ మిషన్ ద్వారా ఎరువుల అమ్మకాలు ఎలా చేయాలో డీలర్లకు వివరించారు. సమావేశంలో కారంచేడు, యద్దనపూడి ఎఒ సుధీర్ బాబు, మేరమ్మ, సొసైటీ సీఈఓ, ఎఇఒ రాధా, ఎస్ఆర్ అసిస్టెంట్ సాగర్ పాల్గొన్నారు.



ఎరువుల డీలర్లతో మాట్లాడుతున్న ఎడిఎ మోహనరావు

అధికారుల తీరుపై విలేకరుల నిరసన

ప్రజాశక్తి - చీరాల

మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్‌పై అవిశ్వాసం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి అధికారులు విలేకరులను అనుమతించలేదు. రెవిన్యూ, పోలీసుల అధికారుల తీరుతో విలేకరులు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పర్యవేక్షణలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబుపై అవిశ్వాసం ప్రవేశపెట్టారు. ఈ సమావేశం కోసం ఉదయం 9గంటల నుండే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు వార్త సేకరణకు మునిసిపల్ కార్యాలయం కు చేరుకున్నారు. పోలీసులు అప్పటికే మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకొని గేట్లు మూసి లోపలికి ఎవరిని అనుమతించకుండా పహార నిర్వహించారు. కౌన్సిల్ సమావేశంలో చైర్మన్‌పై అవిశ్వాసం ప్రారంభమై నప్పటికీ విలేకరులు ఎవ్వరిని అనుమతించలేదు. కలెక్టర్ ఉత్తర్వులు మేరకు నిర్వహిస్తున్న అవిశ్వాసంలో గత కొద్ది రోజుల నుండి ఎంతో ఉత్కంఠంగా ప్రజలు ఎదురు చేస్తున్నప్పటికీ మీడియా ప్రతినిధులను ఎందుకు అనుమతించరని మీడియా ప్రతినిధులు పోలీసులను ప్రశ్నించడంతో చీరాల ఆర్డీఒ, బాపట్ల డిఎస్పీ మీడియాకు అనుమతి లేదని తమకు తెలిపారని, అందువల్లే అనుమతించడం లేదని సిబ్బంది బదులిచ్చారు. దీంతో విలేకర్లు ఎండలోనే వేచి ఉండాల్సి వచ్చింది. మీడియాను అడ్డుకున్న పోలీసులు, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు ఎసి గదుల్లో ఉండి ప్రజల్లోకి వాస్తవాలను తీసుకువెళ్లే విలేకరులను మాత్రం బయట ఎండలో రోడ్డుపై చెట్ల క్రింద నిలబెట్టారు. అవిశ్వాసం సమావేశం అనంతరం అధికారులు వివరణ ఇచ్చేందుకు మీడియా గుర్తుకువచ్చింది. విలేకర్లు లోపలికి వెళ్లకుండా నిరసన వ్యక్తం చేయడంతో ఎంఎల్ఎ, ఎంపి బయటికి వచ్చి కార్యాలయం ఎదుట రోడ్డుపైనే మీడియాతో మాట్లాడారు.



మునిసిపల్ కార్యాలయం వద్ద చెట్ల కింద ఉన్న విలేకరులు

చేనేత నిల్వలు ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత కొన్నేళ్లుగా చేనేత ఉత్పత్తి నిల్వలు పేరుకు పోయాయని, ప్రభుత్వం కొనుగోలు చేసి పరిశ్రమను ఆదుకోవాలని చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవితను కలసి చేనేత నాయకులు విన్నవించారు. విజయవాడ ఎ కన్వెన్షన్‌లో బుధవారం జరిగిన ఎపి రాష్ట్రస్థాయి చేనేత ప్రతినిధుల సమావేశంలో మండలం నుండి పెద్ద ఎత్తున చేనేత కార్మికులు, నాయకులు, సొసైటీ మేనేజర్లు పాల్గొన్నారు. ముందుగా మంత్రి సవితకు పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. చేనేత సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి బోర్డులను ఏర్పాటు చేసి తద్వారా కార్మికులకు పని కల్పించే విధంగా చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వ పాలనలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉన్నారని, ఆ మేరకు అన్ని విధాల కార్మికులకు సహాయ సహకారాలు అందించనున్నట్లు మంత్రి వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చేనేత నాయకులు వామనపల్లి కోటేశ్వరరావు, కౌతరపు యశోద కృష్ణ, ఆకురాతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

తూనికలు, కొలతలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - బాపట్ల

తూనికలు, కొలతలపట్ల వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని తూనికలు కొలతల ఇన్స్‌స్పెక్టర్ బి రాందాస్ అన్నారు. ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం సందర్భంగా ఈనెల 20 వరకు జరిగే అవగాహన వారోత్సవాల్లో భాగంగా బంగారు వర్తకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో తూనికలు కొలతలపై వ్యాపారస్తులు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. ప్రతి వ్యాపారి వినియోగదారుడే అన్నారు. తాను అమ్మే ప్రతి వస్తువు తూనికలు, కొలతలు సక్రమంగా ఉన్నాయా లేదా అని చూసుకున్న అనంతరమే కొనుగోలు చేసి విక్రయాలు కొనసాగించాలని అన్నారు. తూనికలు కొలతల్లో మోసాలు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఏ వస్తువునైనా అమ్మినా కొన్నా, తూకం సరి చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ లిల్లి, ఇమ్మానుయేల్, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాందాస్



ఇఒకు విరాళాలు అందజేస్తున్న దాతలు

ఆలయానికి విరాళం అందజేత

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణానికి కరి ఆంజనేయులు జ్ఞాపకార్థం కరి చిరంజీవి, శివలక్ష్మి దంపతులు రూ.1,01,116, పట్టణానికి చెందిన చిన్ని శ్రీమన్నారాయణ, సీతాదేవి దంపతులు రూ.1,0,1,116, మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన అవిసిన మారుతిరెడ్డి, సుభాషిణి దంపతులు రూ.1,0,1,116 సహాయ కమిషనర్, ఇఒ మదమంచి తిమ్మనాయుడుకు చెక్కు రూపంలో విరాళాలు అందించారు. కార్యక్రమంలో శ్రీరామ జీవన సంఘం శ్రీరామ, చుండూరి మురళి సుధాకర్, అర్చకులు పాల్గొన్నారు.

చందలూరులో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు



విజయ సారధి (82)

స్థానిక రోటరీ మాజీ అధ్యక్షులు కరి కమల్లేశ్వరరావు అభ్యర్థన మేరకు జె పంగులూరు మండలం చందలూరు గ్రామానికి చెందిన చిట్టబత్తిన విజయ సారథి (82) కళ్ళు ఆయన కుటుంబ సభ్యులు దానం చేశారు. విజయ సారథి వృద్ధాప్యం రీత్యా మృతి చెందగా గుంటూరు పెదకాకానికి చెందిన శంకర్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి విజయసారథి కంటి కార్నియా సేకరించారు. నేత్ర దానంకు అంగీకరించిన విజయ సారథి కుమారులు శేషగిరిరావు, మురళీకృష్ణ, కుమార్తె భువనేశ్వరి, అల్లుడు రామాంజనే యులును రోటరీ అవయవ దాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జట్టి వెంకటేశ్వర్లు, చుండి సాంబశివరావు, క్లబ్ ప్రస్తుత అధ్యక్షులు మొహమ్మద్ రఫీని అభినందించారు. అవయువ దానం ప్రోత్సహించాలని కోరారు.

16న కుందుర్రులో భూ సేకరణపై గ్రామసభ

ప్రజాశక్తి- సంతమాగులూరు

ఈనెల 16వ మండలంలోని కుందుర్రు గ్రామ సచివాలయం నందు రెన్యువల్ ఎనర్జీ మ్యాన్ ఫ్యాక్చరింగ్ జోన్ సోలార్ పార్క్ నిర్మాణ నిమిత్తం స్వచ్ఛంద భూసేకరణకు రైతుల అభిప్రాయ సేకరణ నిమిత్తం గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు కె రవిబాబు తెలిపారు. కుందుర్రు, మామిళ్ళపల్లి సచివాలయాల వద్ద చీరాల ఆర్‌డిఒ చంద్రశేఖర్‌నాయుడు అధ్యక్షతన రైతుల అభిప్రాయ సేకరణ చేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు హాజరుకావాలని కోరారు. అభివృద్ధికి భూములు ఇచ్చి సహకరించాలని కోరారు.

సిఎస్ఆర్ నిధులతో విద్యాసంస్థల్లో సౌకర్యాలు

ప్రజాశక్తి - అద్దంకి

మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గంలోని 76 విద్యాలయాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనల్లోంచి పుట్టిన పీ4 విధానాన్ని ఆదర్శంగా తీసుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. రూ.50 లక్షల సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో పేద విద్యార్థులు చదువుకునే అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లుతో పాటు లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ విద్యా సంస్థల్లో 1009 ఫ్యాన్లతో పాటు 1160 లైట్ల ఏర్పాటు ప్రక్రియ శరవేగంగా జరుగుతుంది.

విద్యార్థినులకు సైకిళ్లు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు ఇప్పటి వరకు 550కిపైగా సైకిళ్లను పంపిణీ చేశారు. చదువుకుంటున్న ప్రతీ విద్యార్థినికి సైకిళ్లను అందజేయాలని సంకల్పించారు. 10వేలకు పైగా సైకిళ్లను నియోజకవర్గంలో ఉచితంగా అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. దివ్యాంగులకు 58 మోటారు త్రిచక్ర వాహనాలు సీఎస్ఆర్ నిధులతో అందజేశారు. వీధి వ్యాపారుల కోసం 300 తోపుడు బళ్లను త్వరలోనే పంపిణీ చేయనున్నారు. జె పంగలూరు, అద్దంకి, సంతమాగలూరు, బల్లికురవ, కొరిశపాడు మండలాల అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు.



విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పిస్తున్న మంత్రి గొట్టిపాటి

రాజకీయాలకు అతీతంగా..

ఇప్పటి వరకు ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో నియోజకవర్గంలో రహదారులు, ప్రభుత్వం కార్యాలయాల నిర్మాణంతో పాటు స్థానిక కంపెనీలు వెచ్చించే సీఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో పాటు ప్రజల అవసరాలు తీర్చుతున్నారు. అవసరార్థం తన వద్దకు వచ్చిన వారందరి సమస్యలను రాజకీయాలతో సంబంధం లేకుండా పరిష్కరిస్తున్నారు.



మాట్లాడుతున్న వేటపాలెం ఎఒ ఐ కాశీ విశ్వనాథం

రైతులకు సంయుక్త అవగాహన

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పాపాయపాలెం రైతు సేవా కేంద్రం నందు కౌలు రైతు కార్డులపై రెవెన్యూ, వ్యవసాయ శాఖలు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ కార్డు ఉపయోగాలు, తీసుకునే విధానంను క్లుప్తంగా వివరించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధిదారులకు రూ.20వేలు ప్రభుత్వం ద్వారా మూడు విడతల్లో అందించనున్నట్లు తెలిపారు. భూసార పరీక్షలకు మట్టి నమూనాలు రైతుల పొలాల నుండి సేకరిస్తున్నట్లు తెలిపారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు, పురుగు మందులు వాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఓ సుబ్బారావు, విఎఎ వినయ్ కుమార్ పాల్గొన్నారు.



ఆకర్షణీయంగా విరబూసిన మే పుష్పం

విరబూసిన 'మే' పుష్పం

ప్రజాశక్తి - భటప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలు విఠలేశ్వరనగర్లో నివాసం ఉంటున్న అంగన్‌వాడీ హెల్పర్ గొట్టుముక్కల లక్ష్మీ ఇంటి ఆవరణలో మే పుష్పాలు విరబూసి చూపర్లను ఆకర్షిస్తున్నాయి. గతేడాది మే నెలలో వికసించాల్సిసిన పుష్పాలు అధిక ఉష్ణోగ్రతల కారణంగా జూన్ నెలలో వికసించాయని ఆమె తెలిపారు. ఈ ఏడాది మే మొదటి వారంలో భారీ వర్షం కురవడంతో మే 2వ వారంలోనే పుష్పాలు వికసించాయని చెప్పారు. ప్రతి ఏట మే నెలలో వికసించే ఈ పుష్పాలు చూడటానికి అత్యంత అందంగా ఉంటాయని, వీక్షించేందుకు ప్రజలు ఆసక్తిని చూపుతారని వివరించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - చుండూరు

మండలంలోని మున్నంగివారిపాలెంలో హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఎస్ఐ ద్విచక్ర వాహనదారరులను అపి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మెట్ కుటుంబానికి రక్షణ వంటిదిని, ప్రాణాల్ని కాపాడుతుందని, హెల్మెట్ లేకుండా ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయి వాళ్ళ కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి బాధలు పడుతున్నారని వివరించారు.

ఆర్థిక ఇబ్బందుల్లో కోల్డ్ స్టోరేజీలు

- గిడ్డంగుల్లో ఏళ్ల తరబడి పేరుకున్న నిల్వలు
- పెరిగిన విద్యుత్ చార్జీలు
- నిర్వహణ సమస్యలే ప్రధాన కారణం

ప్రజాశక్తి - ఇంకొల్లు

రైతులు తాము పండించిన పంట సరుకు తక్కువ ధరకు దళారుల పాలు కాకుండా సరుకు నిల్వచేసుకుని అధిక ధర వచ్చినప్పుడు అమ్ముకోవటానికి, ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం శీతల గిడ్డంగుల నిర్మాణాన్ని గత రెండు దశాబ్దాలుగా ప్రోత్సహిస్తూ ఉంది. వీటి నిర్మాణానికి సంబంధించి అట్టి కల్చర్, జాతీయ పప్పు ధాన్యాల అభివృద్ధి సంస్థ ద్వారా అత్యధికంగా రాయితీలు ఇచ్చి శీతల గిడ్డంగుల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తుంది. అయితే కొంతకాలం పాటు అవి రైతులకు, గిడ్డంగుల నిర్మాణ యజమానులకు ఆర్థిక ప్రయోజనం కలిగించినప్పటికీ ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రైతుల పరిస్థితి అలా ఉంటే ఏసిలు కట్టిన యజమానులు ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారు. సరుకు నిల్వ పెట్టిన రైతులు సరుకు వెంటనే అమ్ముకోకపోవటంతో రైతులు నష్టపోవడం తోపాటు ఇటు గిడ్డంగి యజమాని కూడా నష్టపోతున్నాడు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలలో ఎక్కువగా శీతల గెడ్డంగులు ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో కూడా ప్రధానంగా మిర్చి, సెనగ పంట నిల్వల కోసం వీటిని ఏర్పాటు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 120 ఏసీల వరకు పలు ప్రాంతాల్లో ఉన్నాయి. వాటిలో ఎక్కువగా ఒంగోలు, నాగులుప్పలపాడు, ఉప్పుగుండూరు, ఇంకొల్లు, పర్చూరు, మార్టూరు,ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రస్తుతం బాపట్లలో చూసుకుంటే పర్చూరు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో కలుపుకొని 42 శీతల గిడ్డంగులు ఉన్నాయి. వాటిలో అత్యధికంగా ఇంకొల్లులోనే 22 వరకు ఉన్నాయి. పూసపాడు అడ్డ రోడ్డు నుంచి కొనికిపల్లె వరకు 28 కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా పర్చూరు నుంచి పాత మద్రాసు రోడ్డు వెంట ఉన్నాయి. ఇంకొల్లు సినిమా హాల్ సెంటర్ నుంచి కొనికిపల్లె వరకు 12 శీతల గిడ్డంగులు ఉన్నాయి.

ఎక్కువగా శీతల గిడ్డంగుల నిర్మాణం

మిర్చి, సెనగ పంట సాగు చేసే పర్చూరు, పత్తిపాడు నియోజకవర్గాల ప్రాంతాల్లో సీతల గడ్డంగుల నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి మొదటి దశలో తక్కువ పరిమాణంలో శీతల గిడ్డంగులు ఉన్నాయి. అప్పట్లో రైతులు పండించిన వాణిధ్య పంటలైన మిరప, శనగ పంటలకు సరిపడా శీతల గిడ్డంగులు లేక వాటి ప్రాధాన్యత క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ డిమాండుతో సీతల గిడ్డంగులు రైతుల సరుకులతో పూర్తిగా నిండిపోదు ఆదాయం బాగానే వచ్చింది. దీంతో ఈ ప్రాంతాల్లో ఆర్థికంగా బలపడిన వారు శీతల గడ్డంగుల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తూ వచ్చారు. కేవలం పాత మద్రాసు రోడ్డు వెంట శీతల గిడ్డంగుల నిర్మాణాల కోసం భూముల ధరలు ఎక్కువ పలికాయి. ఓవైపు మిరప సాగు తెగుళు, ఎర్రనల్లి, తెల్లనల్లి తదితర నష్టాలతో పంట సాగు తగ్గుముఖం పట్టింది. అలానే తెల్లశనగ, ఎద సెనగ పంట కూడా శనగ పంటకు ఎండు తెగులు రావటంతో దిగుబడులు తగ్గటం, ధరలు ఆశాజనకంగా లేక పడిపోవటం వంటి కారణాలతో రైతులు సెనగ సాగు క్రమమైన తగ్గిస్తూ వచ్చారు. దీంతో శీతల గిద్దంగులు ఎక్కువై వాటి అన్నిటికి సరిపడా పంట సరుకు లేక ఎక్కువ ఖాళీలుగా ఉంటూ ఉన్నాయి.



ఇంకొల్లు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచిన మిర్చి పంట

ఏళ్ల తరబడి గిడ్డంగుల్లో సరుకు నిల్వ ఉండటం

రైతులు పండించిన మిరప, శెనగ, మొక్కజొన్న తదితర గిడ్డంగుల్లో నిల్వచేసిన పంట ఉత్పత్తులను ధరలు రాలేదని ఆశించిన స్థాయిలో గిట్టుబాటు కావటం లేదని, ఏ సంవత్సరంకు ఆ సంవత్సరం అమ్ముకోకుండా ఏళ్ల తరబడి గిడ్డంగుల్లోనే నిల్వ ఉంచుతున్నారు. దీంతో రైతులకు తెచ్చిన పెట్టుబడులకు వడ్డీలు పెరుగుతూ నష్టపోతున్నారు. మిరప ప్రస్తుతం మూడేళ్లుగా నిల్వ ఉంచిన రైతులకు బాడుగ, ఖర్చులకే సరిపోయేలా ఉంది. ఈ పరిమాణంతో ఏసీ నిర్వాహకులకు నగదు రొటీన్ కాకుండా పోయింది. ప్రతి ఏటా సరుకు తీసి మళ్లీ అమ్ముకొని రైతులు తగిన సమయంలో అద్దెలు చెల్లిస్తే డబ్బులు వస్తాయి.

పెరిగిన నిర్వహణ ఖర్చులు

రైతులు సరుకు తీసుకుపోకుండా నగదు రాకపోవటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఉన్నారు. ఈ పరిస్థితితో ఏసీ నిర్వహణ ఖర్చులు ప్రతినెలా తప్పనిసరైంది. రైతులు తెచ్చిన సరుకును ఏసీలో నిల్వ ఉంచుటకు ముఠా కూలీలకు కూలి డబ్బు, అందులో పని చేసే చిరు ఉద్యోగుల నెల జీతాల తోపాటు గిడ్డంగుల నిర్వహణ ఖర్చు తప్పనిసరి అవుతుంది. ప్రతినెల డబ్బులు చెల్లించవలసి వస్తుండటంతో ఆర్థిక భారంగా మారింది. రైతులు తెచ్చిన సరుకు ఏసీలో తరలించడానికి మళ్లీ వాటిని అమ్మినప్పుడు వాహనాలకు లోడ్ చేయటానికి ప్రతిరోజు ముఠాకూలీలతో పని ఉంటుంది. ఇందుకోసం వలస కార్మికులను తెచ్చి వారం బట్వాడా చెల్లిస్తూ ఉంటారు. పొరుగు రాష్ట్రాలైన బీహార్, మహారాష్ట్ర నుంచి కూలీలను తెప్పించి వారికి రానుబోను చార్జీలు, ఇక్కడే ఉండి తినటానికి ఖర్చులు ముందుగానే అడ్వాన్సులు ఇస్తూ ఉంటారు. వారికి తప్పనిసరిగా వారానికి ఒకసారి లెక్క చూసి బట్వాడా యజమాని చెల్లించాలి. వీటికి తోడు నిర్వహణ ఖర్చులు ప్రతినెలా తప్పనిసరి.

పెరిగిన విద్యుత్ బిల్లులు

కోల్డ్ స్టోరేజీలు నిర్మాణ దశతో పోలిస్తే ప్రస్తుతం విద్యుత్ చార్జీలు ఎక్కువగా ఉన్నాయి. శీతల గిడ్డంగిలో రైతులు నిర్వహించిన సరుకు పాడైపోకుండా ఉండాలంటే ప్రతి నిమిషం తప్పనిసరిగా శీతల కరణ శాతం తప్పనిసరిగా పాటించాలి. మినిమం పాటించకుంటే నిల్వ ఉన్న పంట ఉత్పత్తులు దెబ్బతినే ప్రమాదం ఉంది. 24 గంటలు విద్యుత్ తప్పనిసరి. శీతలీకరణకు సరిపడా విద్యుత్ వాడకం ఉంటుంది. ఇందుకు వ్యాపార పరంగా విద్యుత్ బిల్లు అధికంగానే వస్తూ ఉంటుంది. తప్పనిసరిగా విద్యుత్ బిల్లులు చెల్లించాలి. ఇది కూడా యజమానులకు భారంగా మారుతుంది.



రైతులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రైతులకు విత్తన కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరుగుతుందని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని గోవాడ గ్రామంలో పిఎండిఎస్ కిట్ల పంపిణీ బుధవారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రకాల విత్తనాలు కలిపిన ఒక్కొక్క కిట్ 12 కేజీల చొప్పున ఒక ఎకరాకు సరిపడా రూ.950లకు రైతులకు బుధవారం అందించారు. ఏకదళ, ద్విదళ విత్తనాలు కలిపి ఉన్న ఈ విత్తనాలు సాగు చేసి పూత దశలో భూమిలో కలియదున్నడం వలన భూసారం, సేంద్రీయ కర్బనం పెరుగుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధించి పలువురికి ఆదర్శంగా ఉన్న నరిశెట్టి రమేష్ బాబు, స్వాములు, సత్యనారాయణ, అంకారావును శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుట్టా సాంబశివరావు, ఎపి సీఎన్ఎఫ్ ప్రతినిధులు అశోక్ కుమార్, కోకిల వనజారాణి, పద్మలత, భారతి, నరేంద్ర, విఎఎ సాయిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ నేతాజీ

ఉద్యోగులకు ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - కారంచేడు

మండల స్థాయిలో సచివాలయాల సిబ్బంది, కార్యదర్శులు, ఉద్యోగులు ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రతి ఒక్క ఉద్యోగి శారీరక వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఉద్యోగులందరూ శారీరక బలహీనతలు ఉంటే ఫిజియోథెరపీ ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. దీనికి సంబంధించి ప్రతిఒక్కరూ వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ బసవరాణి, సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ప్రారంభమైన ఉత్సవాలు

శింగరకొండలో ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేక కార్యక్రమాలు బుధవారం ఘనంగా ప్రారంభించారు. రాతి ముఖ మండపానికి భారీగా విరాళాలు అందజేసిన దాతల దంపతులు యాగశాల్లోని గణపతి పూజలో పాల్గొన్నారు. విద్యుత్ దీపాల అలంకరణ, చలువ పందిర్లతో ముస్తాబు చేశారు. భక్తులు రాక కోసం ప్రత్యేక ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. తాగునీరు భోజన వసతి ఏర్పాటు చేశారు. 19న ముగింపు వరకు ప్రతిరోజు భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఇఒ మదమంచి తిమ్మనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ సుబ్బరాజు తెలిపారు.

నయా ఫాసిస్టు ధోరణులపై

ఐక్యంగా ప్రతిఘటించాలి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

దేశంలో పెచ్చరిల్లుతున్న నయా ఫాసిస్టు ధోరణులను ఐక్యంగా ప్రతిఘటించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి పిలుపునిచ్చారు. బుధవారం బాపట్ల పుచ్చల పల్లి సుందరయ్య ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో జరిగిన 'ఫాసిజంపై ప్రజాసైన్యం విజయ స్ఫూర్తి' సభలో ఆమె మాట్లాడారు. నయా ఫాసిస్టు ధోరణులను ఎదుర్కొనేందుకు విశాల ఐక్యవేదికగా ప్రజలందరినీ కలుపుకు పోవాలని చెప్పారు. 'ఎనభై ఏళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన ఫాసిజాన్ని ప్రాణాలకు సైతం తెగించి ఎర్రసైన్యం ఎదుర్కొందన్నారు. అదే స్ఫూర్తితో నయా ఫాసిస్టు ధోరణులపై పోరాడాలన్నారు. ఏప్రిల్ 22న పెహల్గాం ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు. పెట్టుబడిదారులు తమ లాభాల కోసం ఫాసిస్టు శక్తులను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోనూ ఫాసిస్టు శక్తులకు మద్దతిచ్చేలా అధికారకూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, జిల్లా నాయకులు కొండయ్య, నాగేశ్వరరావు, భాస్కరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమాదేవి

దేశంలో అబద్ధాల సంస్కృతి

రాజ్యమేలుతోంది..

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

- కెవిపాలెంలో ఆకట్టుకున్న 'ప్రజాపాటల సందడి'

ప్రజాశక్తి-చీమకుర్తి

దేశంలో అబద్ధాల సంస్కృతి రాజ్యమేలు తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని కె.వి పాలెం ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ళ సందర్భంగా కె.వి.పాలెం సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో 'ప్రజాపాటల సందడి' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వియస్ఆర్ మాట్లాడారు. దేశంలో అబద్ధాల కూటమి నాయకులకు మోడీ నాయకత్వం వహిస్తున్నారని విమర్శించారు. నిజాలు నిర్భయంగా చెప్పే నాయకులకు నిర్బంధాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరు అని చెప్పి.. విశ్వగురు అని చెప్పే ట్రంప్‌కు మోడీ పాదాక్రాంతం అయ్యారని విమర్శించారు. ఉగ్రవాదం పేరుతో 26 మంది ప్రాణాలు తీసిన వాళ్లని ఒక్కరినైనా పట్టుకున్నారా.? అని ప్రశ్నించారు. మోడీ చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. ఉగ్రవాదానికి మతం లేదని అన్ని మతాలలో ఉగ్రవాదులు ఉన్నారని పేర్కొన్నారు. టూరిస్టుల ప్రాణాలు కాపాడి వారికి రక్షణ కల్పించిన ముస్లిములకు కనీసం ప్రధాని కతజ్ఞత చెప్పాడా.? అని ప్రశ్నించారు. ఉగ్రవాదాన్ని అణిచివేయటంలో దేశంలోని అందరు ప్రజలు, రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయని, ట్రంప్ ఆదేశాలకు మోడీ సాష్టాంగ పడ్డారని విమర్శించారు. కాశ్మీర్‌పై చర్చించడానికి పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. బిజెపి తిరంగాయాత్ర పేరుతో తిరిగి మోసం చేయాలని చూస్తోందని, అది అబద్ధాల యాత్ర అని పేర్కొన్నారు. రైతులు, కార్మికులు, కూలీలు, నిరుద్యోగులు, ఎదుర్కొం టున్న సమస్యలు ఏవీ కానరావటం లేదన్నారు. మతం మాటున విద్వేషాలు రెచ్చగొట్టే కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఐక్యతకు ప్రమాదం పొంచి ఉందని, ప్రజలు జాగ్రత్తతో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన కళా రూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి సిపిఎం గ్రామ కమిటీ కార్యదర్శి బెజవాడ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, సిపిఎం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, జివి కొండారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, సిపిఎం జిల్లా నాయకులు పూసపాటి వెంకటరావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, సిపిఎం గ్రామ కమిటీ కార్యదర్శి బెజవాడ శ్రీనివాసరావు, సభ్యులు పి సురేష్, కొల్లూరు వెంకటేశ్వర్లు, నల్లూరి కష్ణయ్య, పమిడి రామారావు, డి సుధాకర్, కే అక్కయ్య, పామిడి నరసింహారావు, ఆర్ వెంకట్రావు, పులి ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వివిధ పార్టీల విద్యుత్ మందిరాలు:

తిరునాల సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ మందిరాన్ని ఏర్పాటు చేశారు. వైసిపి ఆధ్వర్యంలో విద్యుత్ మందిరాన్ని, జనసేన ఆధ్వర్యంలో పాటకచేర్లను ఏర్పాటు చేశారు. ఆయా మందిరాలపై సినీ, టీవీ ఆర్టిస్టులు నత్యాలు, పాటలు అలరించాయి. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో భారీ సంఖ్యలో ప్రజలు పూజలు నిర్వహించి మొక్కులు తెచ్చుకున్నారు.

దర్శి నగర పంచాయతీ కార్యాలయం..

పురపాలక శాఖగా మార్పు

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగర పంచాయతీ అప్ గ్రేడ్ చేస్తూ ఈ నెల 14వ తేది బుధవారం జీవో నెంబర్ 85 ప్రకారం నేటి నుంచి ద్వితీయ శ్రేణి పురపాలక శాఖ కార్యాలయంగా మార్చనునంది. ప్రభుత్వము ఉత్తర్వులు మేరకు బుధవారం జీవో నెంబర్ విడుదల చేస్తూ జారీ అయింది. ఈ సందర్భంగా 28-1-2020న దర్శి పంచాయతీ నుండి నగర పంచాయతీగా చేయబడింది. అనంతరము దర్శి నగర పంచాయతీలో సంవత్సరమునకు ఆదాయం రెండు కోట్లకు పైగా ప్రతి సంవత్సరం వస్తుంది. ఈ సందర్భంగా ఈ ఏడాది మూడున్నర కోట్లు పన్నుల రూపంలోవచ్చినట్లు నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వర తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఆదాయ వనరు బేరీజు వేసుకొని ద్వితీయ శ్రేణి పురపాలకశాఖ గుర్తింపు ఇచ్చింది. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ ఇన్ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సహకారంతో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు కషితో ద్వితీయ శ్రేణి పురపాలకంగా గుర్తింపు పొందింది. దీంతో భవిష్యత్తులో పురపాలకశాఖ పరిధిలో పట్టణాన్ని అన్ని వసతులతో తీర్చిదిద్దవచ్చు. ఈ సందర్భంగా ఇంటింటికి మంచినీటి కొళాయిలు ఏర్పాటుకు కూడా కషి జరగబోతుంది ప్రజలందరూ ద్వితీయ శ్రేణి పురపాలకశాఖకు మార్పు చేయడంతో హర్షిస్తున్నారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఫస్టియర్‌లో 713, సెకండియర్‌లో 188 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. మొదటి సంవత్సరం మ్యాథ్స్, బోటనీ, సివిక్స్ పేపర్ 1 పరీక్షకు మొత్తం 11,178 మంది విద్యార్థులను కేటాయించగా 10464 మంది హాజరు కాగా 713 మంది గైర్హాజరయ్యారు. సాధారణ విద్యార్థులు 10,779 మంది విద్యార్థులను కేటాయించగా 10,112 మంది హాజరు కాగా 667 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 397 మందిని కేటాయించగా 352 మంది హాజరు కాగా 45 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఒ ఎ.సైమన్ విక్టర్ మార్కాపురం, యర్రగొండపాలెంలోని 3 కేంద్రాలలో పరీక్షల తీరును పర్యవేక్షించారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు 6 కేంద్రాలను, స్క్వాడ్ సభ్యులు 13 కేంద్రాలలో తనిఖీ చేశారు.

సెకండియర్‌లో 188 మంది గైర్హాజరు

మధ్యాహ్నం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్ 2ఎ, బోటనీ, సివిక్స్ 2 పరీక్షలకు 188 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు మొత్తం 2081 మంది విద్యార్థులను కేటాయించగా 1893 మంది హాజరు కాగా 188 మంది గైర్హాజరయ్యారు. సాధారణ విద్యార్థులు 1821 మంది విద్యార్థులను కేటాయించగా 1662 మంది హాజరు కాగా 159 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 260 మందిని కేటాయించగా 231 మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఒ ఎ.సైమన్ విక్టర్ యర్రగొండపాలెం, త్రిపురాంతకంలోని 2 కేంద్రాలలో పరీక్షల తీరును పర్యవేక్షించారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు 4 కేంద్రాలను, స్క్వాడ్ సభ్యులు 11 కేంద్రాలలో తనిఖీ చేశారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

భూముల రీసర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భూముల రీ సర్వే ప్రక్రియ వేగ వంతంగా పూర్తి చేయాలని భూ పరిపాలన శాఖ అడిషనల్ కమిషనర్ ప్రభాకర్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం అమరావతి సచివాలయం నుండి భూముల రీ సర్వే, రెవెన్యూ శాఖకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్లతో ఆయన కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేయబడిన గ్రామాల లో భూముల రీ సర్వే కార్యక్రమాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆయన అధికారులకు చెప్పారు. రాష్ట్రంలో రెండో విడత భూముల రీ సర్వే చేయడానికి ఎంపిక చేసిన గ్రామాల్లో కూడా రీ సర్వే కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని ఆయన చెప్పారు. ప్రభుత్వ పోరంబోకు భూములను ఆక్రమించుకొని నివాసముంటున్న వారికి భూములను రెగులైజేషన్ చేయడానికి ప్రభుత్వం జీఓ జారీ చేయడం జరిగిందని ఆయన చెప్పారు. ప్రభుత్వం జారీ చేసిన రెగ్యులేషన్ జీవో ప్రకారం ప్రతిపాదనలు తయారుచేసి భూ పరిపాలన శాఖ కార్యాలయం పంపించవలసిందిగా ఆయన అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ జిల్లాలో రేపల్లె డివిజన్ సంబంధించి 100 మంది లబ్ధిదారులు డొంక పోరంబోకు భూములను ఆక్రమించుకొని నివాసాలు ఉంటున్నారని ఆయన చెప్పారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని నివాస ఏర్పాటు చేసుకున్న వారి వివరాలను పట్టాల మంజూరు కోసం ప్రతిపాదన తయారుచేసి ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కనక ప్రసాదరావు పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణాధికారి వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రకాశం జిల్లా లోని ఐదు డిపోల నుండి జూన్ 9న ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు అన్ని ఆన్ లైన్ అందుబాటులో ఉంచి, రిజర్వేషను సదుపాయం కల్పించామన్నారు. గిద్దలూరు డిపోకు చెందిన సర్వీస్ నెంబర్ 48931 సూపర్ లగ్జరీ బస్సు ఛార్జీ 2500, కనిగిరి డిపోకు చెందిన సర్వీస్ నెంబర్ 48957 సూపర్ లగ్జరీ ఛార్జి 2200, మార్కాపురం డిపోకి చెందిన సర్వీస్ నెంబర్ 48069 సూపర్ లగ్జరీ బస్సు ఛార్జీ 2500, ఒంగోలు డిపోకు చెందిన సర్వీస్ నెంబర్ 95909 సూపర్ లగ్జరీ బస్సు రూ.2000, పొదిలి డిపోకు చెందిన సర్వీస్ నెంబర్ 95603 సూపర్ లగ్జరీ బస్సు రూ.2200 ఛార్జీ నిర్ణయించినట్లు తెలిపారు. పౌర్ణమి తేదిలలోనే కాకుండా, గ్రూపులుగా విడి రోజులలో వెళ్ళే వారి కోసం వారు కోరిన తేదిల లో, వారు కోరిన చోటికి స్థానిక డిపో నుండి బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా, అరుణాచల యాత్రకే కాకుండా ఈ నెల 15 నుండి జరుగనున్న సరస్వతి పుష్కరాలకు, ఇతర యాత్రలకు, పుణ్యక్షేత్రాలకు, వేసవి విడుదులకు, యాత్రలకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. .



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

'ప్రభుత్వ' విద్యార్థులు..ఆణిముత్యాలు..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ వసతి గృహాలలోని విద్యార్థులు ఆణిముత్యాలుగా ఎదిగారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రశంసించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులను జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. ప్రభుత్వ వసతి గృహాలలోని విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం పరీక్షల్లో ప్రతిభ కనబరచడంతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం వారికి జిల్లా కలెక్టర్ అవార్డులు, పతకాలను ప్రదానం చేశారు. రేపల్లె ప్రభుత్వ కళాశాల వసతి గృహంలో వసతి పొందుతూ 973 మార్కులు సాధించిన విద్యార్థి సిహెచ్ బసవయ్యను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి సత్కరించారు. కళాశాల వసతి గృహ కేటగిరీలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానం సాధించడంపై ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి బసవయ్యకు ప్రభుత్వం ప్రకటించిన రూ.15 వేల నగదు బహుమతిని కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. జూనియర్ ఇంటర్మీడియట్ లో 90 శాతం పైగా మార్కుల సాధించిన ఐదుగురు విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ వసతి గృహాలలో ఉంటూ పదో తరగతి పరీక్షలు రాసి 85 శాతానికి మించి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. చీరాల ఏ ఎస్ డబ్ల్యూ ఓ పరిధిలోని ఆరు వసతి గృహాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన సదరు సహాయ ఎస్సీ సంక్షేమ అధికారి చిన్న సైదారెడ్డిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె రాజదిబోరా, పర్యవేక్షకులు ఆంధ్ర శ్రీనివాసులు, ఏ ఎస్ డబ్ల్యూఓలు పాల్గొన్నారు.